## క్లుప్తంగా

### ఎస్సై సాంబశివరావుకు కేంద్ర అవార్డు



కంబాలచెరువు: కేంద్ర మంత్రిత్వ శాఖ అందించే మెడల్ ఫర్ మెరిటోరియస్ సర్వీస్ అవార్డుకు టూటౌన్ క్రైం పోలీస్ స్టేషన్ ఎస్సై తోటకూర వీర వెంకట సత్యసాంబశివరావు ఎంపికయ్యారు. ఈ మేరకు కేంద్రమంత్రిత్వ శాఖ నుంచి ఆయనకు గురువారం ఉత్తర్వులు అందాయి. కానిస్టేబుల్ నుంచి ఇప్పటివరకు పోలీసుశాఖలో ఎటువంటి రిమార్కు లేకపోవడంతో సత్యసాంబశివరావుకు ఈ అవార్డు వరించింది. ఢిల్లీలో జరిగే రిపబ్లిక్ పరేడ్‌లో ఆయన ఈ అవార్డును అందుకోనున్నారు.

### సేవలు అభినందనీయం

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): జవహర్ వాకర్స్ క్లబ్ సేవలు అభినందనీయమని కేఎస్ఆర్ హాస్పిటల్ అధినేత కీర్తి సుబ్బారావు అన్నారు. స్థానిక ఆల్కాట్‌తోట ఐటీసీఎల్‌కాలనీలోని పలుకు ఆశ్రమ పాఠశాల పైన జవహర్ వాకర్స్ క్లబ్ రూ.12 లక్షలతో నిర్మించిన వసతిగృహాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. క్లబ్ అధ్యక్షుడు ఉండవల్లి సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ 2025 ప్రెసిడెంట్ ఎం.ప్రభావతి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. చెవిటి, మూగపిల్లల కోసం వసతిగృహం నిర్మించడం అభినందనీయమన్నారు.

### ఎన్నికల్లో ఓటమితో అధైర్యపడొద్దు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి వేణుగోపాలకృష్ణ

రాజమహేంద్రవరం రూరల్: ఎన్నికల్లో ఓటమి చెందామని పార్టీ నాయకులు, కార్యకర్తలు అధైర్య పడాల్సిన అవసరం లేదని, ప్రణాళికబద్ధంగా పార్టీని బలోపేతం చేసుకుని గెలుపే లక్ష్యంగా పనిచేద్దామని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ అన్నారు. స్వాతంత్య్ర వేడుకల సందర్భంగా పార్టీ కార్యాలయానికి వచ్చిన ఆయన నాయకులు, కార్యకర్తలతో మాట్లాడారు. సాధ్యం కాని హామీలు, అసత్య ఆరోపణలతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్నారు. సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేస్తామని ప్రజలకు ఎందుకు హామీ ఇచ్చారో చంద్రబాబు చెప్పాలన్నారు. ఆరోగ్యశ్రీ పథకాన్ని నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నారని, రూ.500 కోట్లు బకాయిలు చెల్లించలేని పరిస్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉందా అని ప్రశ్నించారు. మాజీ సీఎం జగన్ హయాంలో నిర్మాణం చేపట్టిన 17 మెడికల్ కళాశాలలను ప్రైవేటుపరం చేస్తున్నారన్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన రెండో రోజునే నియోజకవర్గంలో రూ.9 కోట్ల విలువైన ఇసుకను దోచేయడం జరిగిందన్నారు. ఎన్నికల ఫలితాలు అనంతరం తన మాతృమూర్తి చనిపోవడం వలన 45 రోజులు పాటు వివిధ కార్యక్రమాల నిర్వహణలో ఉండడం జరిగిందన్నారు. త్వరలోనే నియోజకవర్గంలో ఒక ఇంటికి వెళ్లి ప్రజలను కలుస్తానన్నారు. సమావేశంలో ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ చందన నాగేశ్వర్, మాజీ వైస్ ఎంపీపీ నక్కా రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

### మహాలక్ష్మి అమ్మవారికి పూజలు

సీటీఆర్ఐ: గాడాలలోని మహాలక్ష్మి సమేత చిన వేంకటేశ్వరస్వామివారి పీఠంలో కొలువైన మహాలక్ష్మి అమ్మవారికి శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని గురువారం హోమం నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పూజలు జరిపారు. స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా త్రివర్ణ పతాక రంగుల పుష్పాలతో అలంకరణ చేశారు. కార్యక్రమంలో పీఠాధిపతి చిన వెంకన్నబాబు, హేమవతి తదితరులు పాల్గొన్నారు.

### టీడీపీ నాయకుడితో జెండా ఆవిష్కరణపై వివాదం

తాళ్లపూడి: వేగేశ్వరపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాతీయ పతాకావిష్కరణ టీడీపీ నాయకుడితో చేయించడం వల్ల వివాదస్పదమైంది. గురువారం స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొటోకాల్ పాటించకుండా టీడీపీ నాయకుడితో జెండాను ఆవిష్కరించడంతో గ్రామంలో వివాదం చెలరేగింది. దీనిపై గ్రామ సర్పంచ్ కొమ్మిరెడ్డి పరశురామారావు, కళాశాల కమిటీ చైర్మన్ ఎస్.రమాదేవి అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో ప్రభుత్వ నిబంధనలు ప్రకారం విద్యా కమిటీ చైర్మన్, లేదా వైస్ చైర్మన్, లేదా ప్రిన్సిపాల్, లేదా సర్పంచ్ జెండా ఆవిష్కరించాలి. వాళ్లెవరూ కాకుండా ప్రిన్సిపాల్ జి.శ్రీనివాస్ గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు కైగాల శ్రీనివాస్‌తో జెండా ఆవిష్కరణ చేయించారు. ప్రిన్సిపాల్ ప్రొటోకాల్ పాటించలేదని, దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని సర్పంచ్ కొమ్మిరెడ్డి పరశురామారావు, కళాశాల చైర్మన్ ఎస్.రమాదేవి తెలిపారు. అంతే కాకుండా ఇటీవల కళాశాలలో జరిగిన కొత్త పుస్తకాలు పంపిణీలో కూడా ప్రిన్సిపాల్ ప్రొటోకాల్ పాటించలేదని ఆరోపించారు. దీనిపై ప్రిన్సిపాల్ జి.శ్రీనివాస్ మాట్లాడుతూ తాను స్థానిక ఎమ్మెల్యేను ఆహ్వానించగా ఆయన రావడానికి కుదరదు అని తెలపడంతో టీడీపీ నాయకులతో జెండా ఆవిష్కరణ చేయించినట్టు తెలిపారు.



అనపర్తి ఎంపీపీ స్కూల్‌లో జెండా వందనం కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ సూర్యనారాయణ



పెదపూడి మండల పరిషత్ కార్యాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ కేతా తులసి



రాజానగరంలో పిరమిడ్ తరహాలో ప్రదర్శనలిస్తున్న విద్యార్థులు

# మువ్వన్నెల జెండా రెపరెపలు

- ఘనంగా స్వాతంత్య్ర వేడుకలు
- జాతీయ పతాకాలను ఆవిష్కరించిన నాయకులు
- మహనీయులకు నివాళి

రాజానగరం: ఎందరో మహనీయులు త్యాగాల ఫలితంగా దేశానికి స్వాతంత్య్రం వచ్చిందని, దాన్ని కాపాడుకుంటూ భావితరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. అనపర్తి, రాజానగరం నియోజకవర్గాలలో గురువారం స్వాతంత్య్ర వేడుకలు ఘనంగా జరిగాయి. వాడవాడలా మువ్వెన్నెల జాతీయ జెండా రెపరెపలాడింది. ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, అధికారులు, ప్రజలు ఉత్సాహంగా జరుపుకొన్నారు. రాజానగరంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద జాతీయజెండాను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని సచివాలయాల వ్యవస్థ ద్వారా ప్రజలకు అందించిన ఘనత మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. గడచిన ఐదేళ్లలో సమాజంలో అట్టడుగున ఉన్న అన్ని వర్గాల అభ్యున్నతి కోసం అనేక సంక్షేమ పథకాలు అందించామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు వాసంశెట్టి వెంకన్న, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దూలం పెద్ద, గంగిశెట్టి సోమేశ్వరరావు, వేమగిరి కృష్ణ పాల్గొన్నారు.

**రాజానగరం మండలంలో..**

స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయం వద్ద ఎంపీపీ మండారపు సీతారత్నం జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఎంపీడీవో జ్యోతిర్మయి, ఎంఈఓలు రామన్నదొర, జ్యోతి ప్రసాద్, సూపరింటెండెంట్ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. మండల రెవెన్యూ కార్యాలయం వద్ద తహసీల్దార్ లక్ష్మీలావణ్య, పోలీసు స్టేషన్ వద్ద సీఐ ప్రసన్న వీరయ్య, ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద సీడీపీఓ టి.నాగమణి, గ్రామ సచివాలయాలు, పంచాయతీల వద్ద ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు మువ్వన్నెల జెండాలను ఎగురవేశారు.

**విద్యాలయాల్లో..**

ఆదికవి నన్నయ యూనివర్సిటీలో ఇన్‌చార్జి ఉపకులపతి ఆచార్య వై.శ్రీనివాసరావు త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా సీనియర్ రాజకీయ నాయకుడు ఉల్లి బాబూరావును ఘనంగా సన్మానించారు. కలవచర్లలోని కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే)లో ప్రధానాధికారి డాక్టర్ బీఎస్‌జీఆర్ నాయుడు, గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ (జీజీయూ)లో కులపతి కేవీవీ సత్యనారాయణరాజు (చైతన్య రాజు), జీఎస్ఎల్ వైద్య కళాశాలలో డాక్టర్ గన్ని భాస్కరరావు, దివాన్ చెరువులోని శ్రీప్రకాష్ విద్యానికేతన్‌లో ప్రిన్సిపాల్ ఏవీఎస్ఎన్ మూర్తి, తూర్పుగానుగూడెంలోని ఐఎస్‌టీఎస్ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో చైర్మన్ ఉపేంద్రరెడ్డి జాతీయ పతాకాలను ఆవిష్కరించారు.

- రాజానగరంలోని కేఎల్ఆర్ లెనోరా దంత వైద్య కళాశాల, నామవరంలోని భారతీయ విద్యాభవన్, సంపత్‌నగరంలోని రాజమహేంద్రి ఇంటర్నేషనల్ స్కూల్, రాజానగరంలోని దివ్య విద్యాసంస్థలు, హర్షవర్ధన స్కూల్, కానవరంలోని గాయత్రీ జూనియర్ కళాశాల, బీవీబీలో వేడుకలు నిర్వహించారు.

**త్యాగాలు మరువలేనివి**

మధురపూడి: స్వాతంత్య్రం కోసం మహనీయులు చేసిన త్యాగాలు మరువలేనివని కోరుకొండ జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు అన్నారు. కోరుకొండ మండలం కాపవరం మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఎంపీపీ ఉల్లి వీరవెంకట సత్యసూర్యకుమారి జాతీయ జెండాను ఎగురవేశారు. ఎంపీడీఓ వి.సుందరరావు, ఎంఈఓ కుశలవ దొర, ఈఓపీఆర్డీ వి.మహేశ్వర ప్రతాప్, సెబ్ సీఐ బంగారురాజు పాల్గొన్నారు.

- కోరుకొండలోనీ బీజేపీ కార్యాలయం వద్ద పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఏపీఆర్ చౌదరి ఆధ్వర్యంలో జెండా వందనం జరిగింది.
- మధురపూడిలోని విమానాశ్రయంలో స్వాతంత్య్ర వేడుకలు ఘనంగా జరిగాయి. విమానాశ్రయం డైరెక్టర్ ఎస్.జ్ఞానేశ్వరరావు మాట్లాడుతూ దేశ స్వాతంత్య్ర పోరాటంలో మహానుభావులు చేసిన త్యాగాలను స్మరించుకోవాలన్నారు. కాగా. విమానాశ్రయంలోని టెర్మినల్ భవనాన్ని విద్యుద్దీపాలతో అందంగా అలంకరించారు.

**అమరవీరుల త్యాగ ఫలితం**

పెదపూడి: ఎందరో అమరవీరుల త్యాగ ఫలితమే ఈ స్వాతంత్య్రమని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. అనపర్తిలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో జాతీయజెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సత్తి రామకృష్ణారెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, ఎంపీపీ ఎ.సూర్యనారాయణ, వైస్ ఎంపీపీ వాసు, సర్పంచ్ వారా కుమారి, ఎంపీటీసీ సభ్యులు కొండేటి భీమేష్, ఏడుకొండలు, బండారు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

- పెదపూడి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కేతా తులసి, కాండ్రేగుల గ్రామంలోని ఉన్నత పాఠశాల, సచివాలయం వద్ద జెడ్పీటీసీ సభ్యురాలు పేపకాయల వెంకటలక్ష్మి, సర్పంచ్ కేవీవీ సత్యనారాయణ, మండల రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ సీతాపతి, పెదపూడి, ఏపీత్రయం, కుమారప్రియం, పైన, కాండ్రేగుల సొసైటీలలో ఆయా ప్రత్యేక అధికారులు స్వాతంత్య్ర వేడుకలు నిర్వహించారు. పోలీస్ స్టేషన్‌లో ఎస్సై శోభన్ కుమార్, మండల విద్యాశాఖ కార్యాలయంలో ఎంఈఓ-2 సత్యనారాయణ, వెలుగు కార్యాలయంలో ఏపీఎం చిన బాబు, ఆయా గ్రామ పంచాయతీకార్యాలయాల్లో సర్పంచులు జెండా ఎగురవేశారు.
- అనపర్తిలోని ఎంపీపీ పాఠశాలలో ఎంపీపీ ఎ.సూర్యనారాయణ జెండా వందనం చేశారు. ముందుగా విద్యార్థులు దేశభక్తి గీతాలను ఆలపించారు. ఎంపీడీఓ రవికుమార్, వైస్ ఎంపీపీ కె.దాసు పాల్గొన్నారు.

**త్యాగమూర్తుల స్ఫూర్తితో సాగుదాం**

రంగంపేట: దేశ స్వాతంత్య్రం కోసం ప్రాణాలర్పించిన సమర యోధులు, జాతీయ నాయకుల స్ఫూర్తితో ముందుకు సాగుతామని జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు అన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద గురువారం జరిగిన స్వాతంత్య్ర వేడుకలలో ఆయన పాల్గొన్నారు. ముందుగా వైస్ ఎంపీపీ రాయుడు రాంబాబు జాతీయ జెండా ఆవిష్కరించగా, మహాత్మాగాంధీ చిత్రపటానికి రాంబాబు పుష్పాంజలి ఘటించారు. కార్యక్రమంలో జెడ్పీకో ఆప్షన్ సభ్యుడు లంక చంద్రన్న, ఎంపీడీఓ పి.వెంకటరత్నం, ఎంఈఓలు కె. శ్రీనివాసరావు, మధుసూధనరావు, మండల పరిపాలనాధికారి ఎం. వెంకటేశ్వరరావు, ఏపీఎం అబ్బులు పాల్గొన్నారు.

- మండలంలోని రంగంపేట, చండ్రేడు, పెదరాయవరం, కోటపాడు, మర్రిపూడి, సింగంపల్లి, నల్లమిల్లి, దొడ్డిగుంట, వెంకటాపురం, సుభద్రంపేట, జి.దొంతమూరు, వీరంపాలెం, ఈలకొలను, ఎస్టీ రాజాపురం, ముకుందవరం, వడిశలేరు గ్రామాల్లో ఆయా పంచాయతీ కార్యాలయాల వద్ద సర్పంచ్‌లు జాతీయ పతాకాలను ఆవిష్కరించారు. మండలంలోని పాఠశాలలు, ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల వద్ద జాతీయ జెండాలు రెపరెపలాడాయి.

**బిక్కవోలు మండలంలో..**

బిక్కవోలు: మండల వ్యాప్తంగా మూడు రంగుల జాతీయ జెండా రెపరెపలాడింది. పంచాయతీలు, సచివాలయాల వద్ద ఆయా గ్రామ సర్పంచులు, పాఠశాలల వద్ద ఎస్ఎంసీ కమిటీ సభ్యులు జెండాలను ఎగుర వేశారు. రెవెన్యూ కార్యాలయం వద్ద తహసీల్దార్ రమణి, మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీపీ బుద్దాల కన్నారావు జాతీయ జెండాలను ఎగురువేశారు. కార్యక్రమంలో జిల్లా మహిళ సంక్షేమ స్థాయి సంఘం చైర్మన్ రొంగల పద్మావతి తదితరులు పాల్గొన్నారు. అలాగే పందలపాక జెండా సెంటర్ వద్ద ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, పందలపాక వెలమపేట రామాలయం మున్సబ్ విగ్రహం వద్ద సర్పంచ్ సబ్బారపు పద్మావతి జెండాలను ఎగురు వేశారు.



రాజానగరంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో జెండా ఎగురవేస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా



అనపర్తి వైఎస్సార్ సీపీ కార్యాలయంలో జాతీయ జెండాను ఎగురవేస్తున్న మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

## ప్రొటోకాల్ ఉల్లంఘించడం అన్యాయం

పెదపూడి : ప్రొటోకాల్ అనేది ఒక ప్రజాప్రతినిధిని గౌరవించే పద్ధతి అని, దాన్ని ఉల్లంఘించడం అన్యాయమని కాండ్రేగుల ఎంపీటీసీ సభ్యుడు పేపకాయల వెంకటరమణ అన్నారు. ఆయన కాండ్రేగులలో గురువారం విలేకరులతో మాట్లాడుతూ స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా గ్రామ సచివాలయం, జెడ్పీ ఉన్నత పాఠశాల వద్ద జరిగిన కార్యక్రమాలకు తనను ఆహ్వానించలేదన్నారు. ఇది ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజాప్రతినిధిని అవమానించడమేనని అన్నారు. గ్రామ పంచాయతి వద్ద కార్యదర్శి లక్ష్మీనారాయణ మొదటిగా సర్పంచిని, జెడ్పీటీసీ సభ్యురాలిను పిలిచి, తర్వాత తనను పిలవాల్సి ఉండగా మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీ సభ్యులను ఎన్డీఏ కూటమి నాయకులను పిలిచి జెండా వందనం నిర్వహించారన్నారు. అలాగే ఉన్నత పాఠశాలలో హెచ్ఎం రాజేశ్వరి, ఉపాధ్యాయుడు వినీల్ తదితరులు ఈ విధంగానే తనను పిలవకుండా కార్యక్రమాలు నిర్వహించారన్నారు. దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తానని చెప్పారు.

## మహనీయుల స్ఫూర్తితో పయనిద్దాం

రాజానగరం: దేశ స్వాతంత్య్రం కోసం పోరాటం చేసిన ఎంతోమంది మహనీయుల స్ఫూర్తితో ముందుకు సాగుదామని రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అన్నారు. రాజానగరంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) వద్ద జాతీయ పతాకాన్ని ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

**దేశ ప్రగతికి పాటుపడాలి**

పెదపూడి: ప్రతి ఒక్కరూ దేశభక్తి భావాలను పెంపొందించుకుని దేశ ప్రగతికి పాటుపడాలని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. అనపర్తి మండలం రామవరంలో జాతీయ జెండాను ఆయన ఆవిష్కరించారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల, గ్రామ సచివాలయం, స్వగృహంలో, అనపర్తిలో గ్రామ పంచాయతీ, ఎన్డీఏ పార్టీ కార్యాలయం, ఏరియా ఆస్పత్రి వద్ద జరిగిన కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు.



రాజానగరం పీహెచ్‌సీ వద్ద జెండా వందనం చేస్తున్న ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ



కాపవరం ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో జెండా వందనం చేస్తున్న ఎంపీపీ సత్యసూర్యకుమారి



రంగంపేట ఎంపీపీ కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరణ అనంతరం మాట్లాడుతున్న జెడ్పీటీసీ రాంబాబు



బిక్కవోలు ఉన్నత పాఠశాల వద్ద స్వాతంత్ర్య సమర యోధుల వేషధారణలో విద్యార్థులు



నన్నయ వర్సిటీలో జెండా వందనం చేస్తున్న వీసీ ఆచార్య శ్రీనివాసరావు



విమానాశ్రయంలో జెండా వందనం చేస్తున్న డైరెక్టర్ జ్ఞానేశ్వరరావు

# మార్కెట్లకు శ్రావణ కళ

- కొనుగోలుదారులతో కిక్కిరిసిన వైనం
- వరలక్ష్మి వ్రతం సందర్భంగా సందడి
- పెరిగిన పూజా సామగ్రి ధరలు



జి.మామిడాడలో పూజా సామగ్రిని కొనుగోలు చేస్తున్న మహిళలు

బిక్కవోలు: వరలక్ష్మి వ్రతం సందర్భంగా మార్కెట్లు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. పెద్ద సంఖ్యలో ప్రజలకు తరలిరావడంతో విపరీతమైన రద్దీ ఏర్పడింది. అయితే వరలక్ష్మి వ్రతానికి అవసరమైన పూజా సామగ్రి ధరలు మండిపోయాయి. వాటిని చూసి పేద, మధ్యతరగతి మహిళలు ఆందోళన చెందారు. అమ్మవారి పూజలో వాడే యాపిల్, బత్తాయి, ద్రాక్ష, దానిమ్మ పండ్లతో పాటు చామంతి, కలువ పువ్వుల ధరలు ఆకాశాన్నంటాయి. తప్పనిసరి పరిస్థితిలో తమ శక్తి మేరకు ప్రజలు వాటిని కొనుగోలు చేశారు. నియోజకవర్గంలోని అనపర్తి, బిక్కవోలు, పెదపూడి, రంగంపేట, తొస్సిపూడి, వడిశలేరు, గొల్లల మామిడాడ, కొమరిపాలెం, కుతకులూరు. గ్రామాలలో మార్కెట్లు కొనుగోలుదారులతో కిక్కిరిశాయి. సాధారణ రోజుల్లో రూ.20 ఉండే ఆపిల్ కాయ రూ.50, బత్తాయి రూ.8 నుంచి 25, దానిమ్మ రూ.10 నుంచి రూ.30, ద్రాక్ష కిలో రూ.80 నుంచి 200, డజన్ చామంతి పువ్వులు రూ.10 నుంచి రూ.30, కలువపువ్వు రూ.10కి పెరిగాయి.

# నిస్వార్థ సేవలకు ఉత్తమ అవార్డులు



కాకినాడలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నుంచి అవార్డు అందుకుంటున్న పెదపూడి ఎంపీడీఓ ఆశాజ్యోతి



జిల్లా పంచాయతీరాజ్ అధికారి మహమ్మద్ అలీముల్లా నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న జేఈ శ్రీనివాసరావు



ప్రశంసాపత్రాలు అందుకుంటున్న రంగంపేట అటెండర్ లక్ష్మి, బిక్కవోలు వీఆర్వో అనసూరి పోతురాజు, బలభద్రపురం వీఆర్వో శ్రీనివాస్

పెదపూడి: విధి నిర్వహణలో నిస్వార్థ సేవలందించే వారికి ఉత్తమ ప్రశంసలు లభిస్తాయని ఎంపీపీ కేతా తులసి, జెడ్పీటీసీ సభ్యురాలు పేపకాయల వెంకటలక్ష్మి అన్నారు. కాకినాడ జిల్లా పరిధిలోని ఉత్తమ ఎంపీడీఓగా స్థానిక ఎంపీడీఓ పి.ఆశాజ్యోతి ఎంపికయ్యారు. ఆమె కాకినాడ సిటీలోని పోలీసు పేరేడ్ గ్రౌండ్‌లో ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కల్యాణ్, కలెక్టర్ షాన్ మోహన్, ఎస్పీ విక్రాంత్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు.

బిక్కవోలు: బిక్కవోలు - 4, బలభద్రపురం సచివాలయం-3 లో వీఆర్వోలుగా పనిచేస్తున్న అనసూరి పోతురాజు, మాచవరపు శ్రీనివాస్‌కు ఉత్తమ వీఆర్వోలు అవార్డులు లభించాయి. రాజమహేంద్రవరంలో జరిగిన స్వాతంత్య్ర వేడుకలలో కలెక్టర్ పి.ప్రశాంతి, మంత్రి కందుల దుర్గేష్ సమక్షంతో అవార్డులు అందుకున్నారు. వారిని తహసీల్దార్ రమణి, డిటీ కృష్ణ అభినందించారు.

రంగంపేట: తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అటెండర్‌గా పనిచేస్తున్న కాజులూరి లక్ష్మి, మండల పంచాయతీరాజ్ శాఖ జేఈ కె.శ్రీనివాసరావు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి బి.వేణుశ్రీలక్ష్మి, ఈలకొలను గ్రామ ఉద్యాన సహాయకుడు కె.కామేశ్వరరావు, రామకృష్ణాపురం అంగన్‌వాడీ సహాయకురాలు కె.శాంతి తదితరులు వారి రంగాల్లో ఉత్తమ సేవలు అందించినందుకుగాను పురస్కారాలకు ఎంపికయ్యారు. రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాల మైదానంలో జరిగిన వేడుకల్లో మంత్రి దుర్గేష్, కలెక్టర్ ప్రశాంతి చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారు.

# సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలి



సమావేశంలో ప్రసంగిస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు భాస్కర్

ధవళేశ్వరం: మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలని ఆంధ్రప్రదేశ్ స్టేట్ బేవరేజెస్ కార్పొరేషన్ కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.భాస్కర్ డిమాండ్ చేశారు. అసోసియేషన్ రాష్ట్ర స్థాయి ఆత్మీయ సమావేశం గురువారం ధవళేశ్వరంలోని తులసి హరి కల్యాణ మండపంలో జరిగింది. భాస్కర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి రాష్ట్ర నలుమూలల నుంచి ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన ప్రభుత్వ మద్యం దుకాణాలలో పనిచేస్తున్న సూపర్‌వైజర్లు, సేల్స్ మ్యాన్లు హాజరయ్యారు. భాస్కర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అక్టోబర్ ఒకటవ తేదీ నుంచి నూతన లిక్కర్ పాలసీని తీసుకుని వస్తామని ప్రకటన చేయడంతో బేవరేజ్ సంస్థలో పనిచేస్తున్న వేలాదిమంది ఉద్యోగాలను కోల్పోతారనే ఆందోళన వ్యక్తం చేశారు. అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాశల రామచంద్రరావు, ప్రధాన కార్యదర్శి కోటేశ్వరరావు, సహకార్యదర్శి చంద్రారెడ్డి, కోశాధికారి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

# ఆకట్టుకున్న పోలీసు జాగిలాల ప్రదర్శన





పోలీస్ జాకీ విన్యాసం, మంత్రి కందుల దుర్గేష్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న పోలీస్ గోల్డీ

సీటీఆర్ఐ: ఆర్ట్స్ కళాశాల మైదానంలో గురువారం పోలీసు శాఖ నిర్వహించిన డాగ్ షో ఎంతగానో ఆకట్టుకుంది. పోలీసు జాగిలాలైన గోల్డీ, బ్రేవో, లక్కీల ప్రదర్శనలు, విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ముందుగా పోలీసు శునకం గోల్డీ రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్‌కు సెల్యూట్ చేసింది. అనంతరం పుష్పగుచ్ఛంఅందించింది. బస్టాండ్, రైల్వే స్టేషన్లు వంటి రద్దీ ప్రదేశాలలో తీవ్రవాదులు అమర్చే బాంబ్‌లను కనుగొనడంలో పోలీసు శునకాలు శిక్షణ పొందాయి. ఇందులో భాగంగా పరేడ్ గ్రౌండ్స్‌లో డమ్మీ బాంబులు ఉంచిన లగేజీ బ్యాగ్‌ను కనుగొనడం, అగ్ని ప్రమాద సమయంలో చేసిన విన్యాసాలు అబ్బురపరిచాయి. వీటి విన్యాసాలను మంత్రి దుర్గేష్, కలెక్టర్ పి ప్రశాంతి, జాయింట్ కలెక్టర్ ఎస్.చిన రాముడు, ఎస్పీ డి.నరసింహ కిషోర్, మున్సిపల్ కమిషనర్ కేతన్ గార్గ్ ప్రశంసించారు.